



బంగారు బందరే మన లక్ష్యం

జిల్లా కేంద్రంగా దశాబ్దాల చరిత్ర కలిగిన బందరు నగరం అభివృద్ధిలో మాత్రం ఇంకా వెనుకబడే ఉంది. విస్తారమైన తీర ప్రాంతం ఉన్నా ఎటువంటి ప్రయోజనం లేకుండాపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో బందరు అభివృద్ధే లక్ష్యంగా మంత్రి కొల్లు రవీంద్ర అడుగులు ముందుకు వేస్తున్నారు. బంగారు బందరు కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. 2026 డిసెంబరు నాటికి పోర్టు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. సముద్ర అలల ఉధృతిని తగ్గించి, పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్‌లో రక్షణ గోడ, రూ.50 కోట్లతో మల్టీపర్పస్ స్టేడియం, 300 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు, రూ.164 కోట్లతో డ్రెయిన్ల పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మే 15 నుంచి 18 వరకు భారీ స్థాయిలో మంగినపూడి బీచ్‌లో బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. అన్నిరంగాల్లో బందరు నగరం అభివృద్ధి సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవడానికి నగర ప్రముఖులతో సమావేశమయ్యారు. బంగారు బందరే మన లక్ష్యమని ప్రకటించారు.

2026 డిసెంబరు నాటికి పోర్టు పనులు పూర్తి

సముద్ర అలల ఉధృతిని తగ్గించేందుకు బీచ్‌లో రక్షణగోడ

- రూ. 50 కోట్లతో మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు
- గిలకలదిండి-కర్రగ్రహారం మధ్య 300 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటు
- సీఎం దృష్టికి రూ.164 కోట్లతో డ్రెయిన్‌ల పునరుద్ధరణ పనులు
- మే 15 నుంచి 18 వరకు మంగినపూడి బీచ్‌లో బీచ్ ఫెస్టివల్
- యువతకు ఉపాధే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు
- సీఆర్‌డీఏ పరిధిలోకి జిల్లాలోని అన్ని ప్రాంతాలను చేర్చేందుకు ప్రతిపాదన
- బందరు అభివృద్ధి ప్రణాళిక వెల్లడించిన మంత్రి కొల్లు రవీంద్ర
- 'బంగారు బందరు సాకారం'పై నగర ప్రముఖులు, అధికారులతో ఆత్మీయ సమావేశం
- అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి



మచిలీపట్నం నగర వాసుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బంగారు బందరు రూపకల్పనకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రతి ఒక్కరూ తమ తమ వంతు సహకారం అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. 'బంగారు బందరు సాకారం' అనే కార్యక్రమంపై జడ్పీ కన్వెన్షన్‌హాలులో నగర ప్రముఖులు, అధికారులతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బందరు అభివృద్ధి కోసం రూపొందించిన ప్రణాళికలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి వివరించారు. జిల్లా కేంద్రంగా ఉన్న బందరు కాలక్రమంలో కొంత మేర నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో విద్య, వైద్యం, ఉపాధి రంగాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామన్నారు. బందరు అభివృద్ధిని కాంక్షించేవారు మరిన్ని సలహాలు, సూచనలు అందించి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. సీఆర్‌డీఏ పరిధిలోకి జిల్లాలోని అన్ని ప్రాంతాలను కలపాలని సీఎం చంద్రబాబు వద్ద ప్రతిపాదన పెట్టినట్లు మంత్రి వివరించారు. మరిన్ని వివరాలు మంత్రి మాటల్లో..

రూ. 164 కోట్లతో డ్రెయిన్‌ల పునరుద్ధరణ

నగరంలో డ్రెయిన్‌ల పునరుద్ధరణకు రూ.164 కోట్ల అంచనాలు రూపొందించారు. ఈ నిధుల విడుదలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి, సాధ్యమైనంత త్వరగా నిధులు తెచ్చి డ్రెయిన్‌లను పూర్తిస్థాయిలో నిర్మాణం చేయనున్నారు. నగరంలో డ్రెయిన్‌లకు సంబంధించి లింక్‌లను కలిపేందుకు రూ.13 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఈ నేపథ్యంలోనే నగరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించారు. నగరంలో పశువుల సంచారాన్ని నిలువరించేందుకు మంగినపూడిబీచ్ ప్రాంతంలో 10 ఎకరాల భూమిని కేటాయించారు. రోడ్లపై తిరిగే పశువులను అక్కడకు తరలిస్తారు. నగరంలో రోజుకు 90 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఈ చెత్తను గుంటూరు జిల్లాలోని పవర్ ప్రాజెక్టుకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరు 2వ తేదీ నాటికి మచిలీపట్నం డంపింగ్ యార్డును అందమైన పార్కుగా రూపొందించనున్నారు. మే 15 నుంచి 18వ తేదీ వరకు మంగినపూడి బీచ్‌లో బీచ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

అభివృద్ధి ప్రణాళిక ఇలా..

డిసెంబరు 2026 నాటికి బందరు పోర్టు పనులను పూర్తి చేసి ఇక్కడి నుంచి ఎగుమతులు, దిగుమతులు ప్రారంభిస్తారు. పోర్టు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తే జిల్లాకు చెందిన యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సహకారంతో మిగతా 6లో..

ఆలయం ముందు రోడ్డు మధ్యగా నిర్మించిన ప్రహరీ



కబ్జా కాలనీ

సన్‌సిటీ కాలనీలో విచ్చలవిడిగా కబ్జాలు

ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి విక్రయాలు

- నిర్మాణాలకు అనుమతులిస్తున్న టౌన్‌ప్లానింగ్
- కబ్జా స్థలాలకు రోడ్లు వేసిన ఇంజనీరింగ్ విభాగం
- అన్నీ తానై చక్రం తిప్పుతున్న ఓ ఆలయ పూజారి
- 1.20 ఎకరాల విలువ సుమారు రూ.15 కోట్లు

అది అజిత్‌సింగ్‌నగర్‌లోని సన్‌సిటీ కాలనీ.. పేరుకు కాలనీ అయినా ఇది కబ్జాల పుట్ట. ఇక్కడ ఒక్క ప్రైవేట్ స్థలం కూడా ఉండదు. అన్నీ ఇరిగేషన్ శాఖ భూములే. కోట్లాది రూపాయల విలువైన ఈ భూములను కబ్జాచేసి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న కబ్జాకోరులు ఏకంగా వాటన్నింటినీ ఓ కాలనీగా సృష్టించారు. ఇటు ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, అటు నగరపాలక సంస్థ అధికారుల కాసుల కక్కుర్తి కారణంగా ఇక్కడ నెలకొక కబ్జా వెలుగుచూస్తూనే ఉంటుంది. స్థానికంగా ఉండే ఓ ఆలయ పూజారి అన్నీతానై చక్రం తిప్పుతూ ఈ కబ్జాల పరంపరను కొనసాగిస్తున్నాడు.

ఆంధ్రజ్యోతి-అజిత్‌సింగ్‌నగర్ : స్థానికంగా బుడమేరును ఆనుకుని సర్వే నెంబరు 32లో 1.20 ఎకరాల ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ.15 కోట్ల పైమాటే. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో కబ్జాదారులు సదరు స్థలాన్ని ముక్కలు చేశారు. కబ్జాలకు పాల్పడి సర్వే నెంబరు 31/1ఏతో నకిలీ డాక్యుమెంట్లు, వీలునామాలు సృష్టించి అమ్మకాలకు పెట్టేశారు. అయితే, సదరు స్థలాల్లో ప్రస్తుతం పదుల సంఖ్యలో భవనాలు వెలిశాయి. ఇరిగేషన్ భూములని తెలిసి కూడా టౌన్‌ప్లానింగ్ అధికారులు విచ్చలవిడిగా ఇళ్ల నిర్మాణాలకు ప్లాన్లు ఇచ్చేశారు. దీంతో నగరపాలక ఇంజనీరింగ్ అధికారులు ఇటీవల రోడ్లను కూడా ఏర్పాటు చేసేశారు. ఇక తామేమి తక్కువ కాదన్నట్టు విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్లు ఇచ్చారు. దీంతో అనేక మంది.. స్థలాలు తక్కువ ధరకు వస్తున్నాయన్న ఆశతో కొని మోసపోతున్నారు.

ఏకై వచ్చి మేకయ్యాడు..!

పదేళ్ల క్రితం బుడమేరు పక్కనే ఉన్న ఇరిగేషన్ స్థలాన్ని కొందరు కబ్జాచేసి అమ్మకానికి పెట్టగా, తక్కువ ధరకు 250 గజాల ప్రభుత్వ భూమిని దక్కించుకున్న ఓ ఆలయ పూజారి అక్కడి నుంచి తన కబ్జాల పరంపర కొనసాగిస్తున్నారు. ఏకై వచ్చి మేకయినట్లుగా మిగతా 6లో..


గ్యాంగ్ సంగమేశ్వరం!

- ఆర్టీసీ బస్సుల్లో సంగమేశ్వరం తరలింపు
- గుర్తింపు కార్డులు, ఫోన్లు లాక్కుని వెట్టి చాకిరి
- తప్పించుకుని వచ్చిన విజయవాడ యువకుడు

విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు

రైల్వే స్టేషన్ వద్ద నిఘా.. వలస కూలీల ట్రాప్

రైల్వే స్టేషన్ వద్ద పాగా వేస్తారు. రైలు దిగి స్టేషన్ నుంచి బయటకు వచ్చిన వారిని నిశితంగా గమనిస్తారు. ఉపాధి కోసం వచ్చిన వారితో మాట కలుపుతారు. ఊరు, వాడ తెలుసుకుంటారు. ఆ తర్వాత వారి వ్యసనాలను కనిపెట్టి ఓ చోట పనిచేస్తే ఊహించని డబ్బు వస్తుందని ఆశ చూపుతారు. వారు సరే అనగానే కర్నూలు జిల్లాలోని సంగమేశ్వరానికి పంపుతారు. ఆ తర్వాత అక్కడ వారిని నిర్బంధించి వెట్టి చాకిరి చేయించుకుంటారు. ఉపాధి కోసం ఎదురు చూస్తున్న కార్మికులను ట్రాప్ చేసే ముఠా బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ కూలీలను టార్గెట్ చేస్తున్నారు. ఇలా సంగమేశ్వరం వెళ్లి చిత్రహింసలు ఎదుర్కొన్న ఓ యువకుడు తప్పించుకుని రావడంతో ఈ వ్యవహారం బట్టబయలైంది.



బాధితుడు పవన్ కుమార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రాజీవ్ నగర్‌కు చెందిన కూతాడి పవన్ కుమార్‌పై నున్న పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీటు ఉంది. అతడు ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. గతేడాది నవంబరులో తనతోపాటు ఆటోడ్రైవర్‌గా పనిచేసే రాము అనే యువకుడు అద్దెకు ఆటో ఇప్పిస్తానని తీసుకెళ్లాడు. రైల్వే స్టేషన్ వద్దకు తీసుకువెళ్లి అక్కడ వదిలేశాడు. తర్వాత కాసేపటికి సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్‌షీట్ ఉన్న ఓ వ్యక్తి అతని వద్దకు వెళ్లాడు. కాసేపు మాట్లాడి మందు తాగించాడు. తానే ఉపాధి చూపిస్తానని పవన్ కుమార్‌ను నమ్మించాడు. కొద్దిసేపటికి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారితో కల్పించుకుని మాట్లాడాడు. వాళ్లందరిని ఉపాధి చూపిస్తానని అక్కడే ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి వద్దకు తీసుకెళ్లాడు. అతడు వారిని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కర్నూలు బస్సు ఎక్కించాడు. అక్కడ బస్సు దిగిన తర్వాత ఒక వ్యక్తి ఆటోలో సంగమేశ్వరం తీసుకెళ్లాడు. అక్కడ నది ఒడ్డున ఏర్పాటు చేసిన షెడ్లలో వారిని ఉంచారు. అక్కడ నదిలో ఏర్పాటు చేసిన వలలను లాగే పనులకు వారిని మిగతా 6లో..

అర్ధరాత్రి పని.. ఒక పూటే భోజనం

విజయవాడ రైల్వేస్టేషన్‌కు ఉపాధి పనుల నిమిత్తం వచ్చిన వారిని ట్రాప్ చేయడానికి ఒక గ్యాంగ్ ప్రత్యేకంగా పనిచేస్తున్నట్టు పవన్ కుమార్ వాంగ్మూలం ద్వారా తెలుస్తోంది. సంగమేశ్వరంలో చేపల వేటకు నదిలో వేసిన వలలను బయటకు లాగడానికి అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు రాత్రి వరకు పనిచేస్తున్నట్టు పవన్ కుమార్ పోలీసులకు వివరించాడు. సంగమేశ్వరం చేరుకోగానే వారి నుంచి ఆధార్ కార్డు, ఫోన్లు, డబ్బులు లాగేసుకుంటారు. ఆ తర్వాత అక్కడే నిర్మించిన షెడ్‌ల్లో వసతి ఇస్తారు. రోజుకు ఒకసారి మాత్రమే భోజనం పెడతారు. రాత్రిపూట టాయిలెట్‌కు వెళ్లనివ్వరు. ప్రతి షెడ్డు వద్ద పని చేయించుకునే యజమానుల కుటుంబ సభ్యులు కర్రలతో కాపలా కాస్తారు. ఎవరైనా పారిపోవడానికి ప్రయత్నిస్తే కర్రలతో చితకబాదుతారని పవన్ కుమార్ పోలీసులకు వివరించాడు. కార్మికులను ట్రాప్ చేసిన వారికి ఒక్కో వ్యక్తిపై రూ.5వేల కమీషన్ ఇస్తున్నట్టు పవన్‌కుమార్ తెలిపాడు.

172 ఎకరాలు డీనోటిఫై!

ఓఆర్ఆర్ కోసం ఎన్టీఆర్ జిల్లాలో అటవీ భూములు

- కొండపల్లి (తిమ్మాపురం), గుర్రాజుపాలెం, దుగ్గిరాలపాడు, గూడెం మాధవరంలో గుర్తింపు
- ప్రత్యామ్నాయంగా 172 ఎకరాలు కేటాయించనున్న రాష్ట్ర ప్రభుత్వం

పర్యావరణ అనుమతులకు ఎన్‌హెచ్ అధికారులు సన్నద్ధం

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కోసం ఎన్టీఆర్ జిల్లాలో అటవీ భూముల డీ నోటిఫై చేయటానికి వీలుగా ఎన్‌హెచ్ అధికారులు రంగం సిద్ధం చేశారు. మొత్తం 172 ఎకరాల అటవీ భూములను డీ నోటిఫై చేయనున్నారు. ఈ భూములన్నీ కొండపల్లి (తిమ్మాపురం), గుర్రాజుపాలెం, దుగ్గిరాలపాడు, గూడెం మాధవరం గ్రామాల పరిధిలో ఉన్నాయి. ఇవన్నీ డీ నోటిఫికేషన్ పరిధిలోకి వస్తాయి. ఆయా ప్రాంతాల్లో పర్యావరణ అనుమతుల కోసం అధికారులు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం ఐదు కిలోమీటర్ల పరిధిలో అటవీ భూములు ఉన్నాయి. ఒక కిలో మీటరు అంటే ఏడు హెక్టార్లు. ప్రస్తుతం 70 మీటర్ల వెడల్పు లెక్కన చూసుకుంటే 86 ఎకరాల అటవీ భూములు అవసరమవుతున్నాయి. అదే అవుటర్ రింగ్ రోడ్డు వెడల్పు 140 మీటర్లు అయితే మరో 86 ఎకరాల అటవీ భూములను తీసుకోవాల్సి వస్తుంది. అంటే ఈ లెక్కన 172 ఎకరాల అటవీ భూములు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు కాకపోయినా భవిష్యత్తులో అయినా సరే ఈ మేరకు అటవీ భూములను డీనోటిఫై చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎప్పుడు పడితే అప్పుడు డీ నోటిఫై అనేది చేసేది కాదు కాబట్టి.. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ముందుగానే 172 ఎకరాల అటవీ భూములకు సంబంధించి డీనోటిఫికేషన్‌కు ప్రతిపాదించాలని ఎన్‌హెచ్ వర్గాలు భావిస్తున్నాయి.

అవుటర్‌లోనూ 'హై టెన్షన్'

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు కూడా హై టెన్షన్ లైన్స్ సమస్య ఉంది. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో మొత్తం 34 చోట్ల హై టెన్షన్ విద్యుత్ వైర్లు అడ్డొస్తున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో 16 చోట్ల ఈ పరిస్థితి ఉంటే, అవుటర్ రింగ్ రోడ్డులో 34 చోట్ల హై టెన్షన్ విద్యుత్తు లైన్స్ వస్తున్నాయి. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో హై టెన్షన్ విద్యుత్తు లైన్ల మార్పిడికి అనేక సమస్యలు ఏర్పడ్డాయి. దాదాపు మూడేళ్లుగా ఈ సమస్యలు తెగటం లేదు. తేలటం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్‌హెచ్ అధికారులు ముందస్తుగా ట్రాన్స్‌కో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో వస్తున్న సమస్యలు, అభ్యంతరాలు, కోర్టు కేసులను దృష్టిలో పెట్టుకుని అమరావతి అవుటర్ రింగ్ రోడ్‌లో అలాంటి సమస్యలు ఎదుర్కోకుండా ఉండడానికి ఇప్పటి నుంచే తగిన అలైన్‌మెంట్స్‌ను సిద్ధం చేసుకోవాలని, స్థానిక రైతులతో ఇబ్బందులు లేకుండా వారితో సంప్రదింపులు జరపాలని కూడా ఎన్‌హెచ్ అధికారులు సూచిస్తున్నారు.



వెడల్పుపై కేంద్రం నుంచి రాని స్పష్టత!


కేంద్ర ప్రభుత్వం నుంచి ఇంకా అవుటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి వెడల్పు ఎంత అనే దానిపై స్పష్టతనిచ్చేలా మినిట్స్ రాకపోవడంతో దీని కోసం ఎన్‌హెచ్ అధికారులు ఎదురు చూస్తున్నారు. మినిట్స్ రాగానే అవసరాన్ని బట్టి అటవీ భూముల డీ నోటిఫికేషన్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులు భావిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ (తిమ్మాపురం), గుర్రాజుపాలెం, దుగ్గిరాలపాడు, గూడెం మాధవరం అటవీ ప్రాంతాల మీదుగా ఓఆర్ఆర్ అలైన్‌మెంట్ వస్తోంది. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డుకు ఈ భూములు అవసరం అవుతున్నాయి. ఈ భూముల డీ నోటిఫై చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని, ఇబ్బందులు తలెత్తవని ఎన్‌హెచ్ అధికారులు అంటున్నారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో ఎన్టీఆర్ జిల్లాలో ఆంధ్ర - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో రెండు టన్నెల్స్ నిర్మాణం చేపట్టవలసి మిగతా 6లో..

రోప్‌వే!

బెర్మ్‌పార్క్ నుంచి భవానీ ఐల్యాండ్ వరకు..

ప్రణాళికలు రచిస్తున్న ఏపీటీడీసీ అధికారులు

ఒకటిన్నర దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న నగర వాసులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): భవానీ ఐల్యాండ్‌కు రోప్‌వే ఏర్పాటుపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. దశాబ్దంన్నర కాలంగా విజయవాడ నగరానికి రోప్‌వే ఊరిస్తూనే ఉంది. ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ సాకారం కావటానికి వీలుగా అడుగులు పడుతున్నాయి. గతంలో ఏర్పడిన అడ్డంకులను దృష్టిలో పెట్టుకుని ఈ సారి రోప్‌వే ప్రాజెక్టు కోసం ఏపీటీడీసీ అధికారులు డిజైన్ చేస్తున్నారు. గతంలో రాజీవ్ గాంధీ పార్కు నుంచి ఇంద్రకీలాద్రికి, అక్కడి నుంచి భవానీ ద్వీపం రోప్‌వే నడపాలన్న ప్రతిపాదన వచ్చింది. ఇంద్రకీలాద్రి దిగువన ఆర్కియాలజీ సంరక్షణలో అక్కన్నమాదన్న గుహలు ఉండటంతో అభ్యంతరాలు వచ్చాయి. ఆ తర్వాత దేవస్థాన వైదిక కమిటీ కూడా ఎత్తు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ప్రతిబంధకాలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ సారి అతి తక్కువ నిడివి కలిగిన రోప్‌వే ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. హరిత బెర్మ్ పార్క్ నుంచి కృష్ణానది మీదుగా సాగుతూ భవానీ ఐల్యాండ్‌కు చేరుకునేలా రోప్‌వే ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. బెర్మ్‌పార్క్ నుంచి భవానీ ద్వీపం వరకు 0.88 కిలోమీటర్ల మేర రోప్‌వేకు ఏపీటీడీసీ అధికారులు ప్రణాళికలు రచించారు. అతి త్వరలో దీనిపై బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుని పీపీపీ విధానంలో అప్పగించే అవకాశం ఉంది.

మంగినపూడిలో బీచ్ ఫెస్టివల్

- మే 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహణ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మంగినపూడి బీచ్‌లో మే 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం తెలిపారు. బీచ్ వద్ద జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. యువతలో చైతన్యం నింపేలా వివిధ రంగాల ప్రముఖుల ఉపన్యాసాలు, ఆహ్లాదం, ఆనందం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బీచ్ ఫెస్టివల్‌కు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు వివరించారు.

మరోసారి బీభత్సం

- ఈదురు గాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలు
- పూర్తిగా రాలిపోయిన మామిడి కాయలు
- తిరువూరులో వరి, ఏ కొండూరులో మొక్కజొన్నకు తీవ్ర నష్టం
- రైతుల్ని కోలుకోలేని దెబ్బతీసిన అకాల వర్షాలు

6లో



మరోసారి బీభత్సం

ఈదురు గాలులు, వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలు

- తిరువూరులో వరికి, ఏ కొండూరులో మొక్కజొన్నకు తీవ్రనష్టం
- పూర్తిగా రాలిపోయిన మామిడి కాయలు
- రైతుల్ని కోలుకోలేని దెబ్బతీసిన అకాల వర్షాలు

తిరువూరు/ఏ కొండూరు, ఆంధ్రజ్యోతి: అన్నదాతల్ని అకాల వర్షాల భయం వీడటం లేదు. వారం పది రోజుల వ్యవధిలో మూడు సార్లు ఈ అకాల వర్షాలు, ఈదురు గాలులు అన్నదాతల నడ్డి విరిచేశాయి. ఇప్పటికే రెండు సార్లు వీచిన ఈదురు గాలులకు నష్టపోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న రైతులకు మరోమారు ఈదురు గాలులు కోలుకోలేని దెబ్బతీశాయి. ఏకంగా వడగండ్ల వాన పడటంతో పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. మొత్తం మీద రైతులను రూ.లక్షల్లో నష్టపోయేలా చేశాయి. అంతేకాక ఈదురు గాలులు కారణంగా పట్టణంలో పెద్ద ఎత్తున చెట్లు నేలవాలాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు విరిగిపోయాయి. బోర్డులు నేలమట్టమయ్యాయి.

పట్టణంలో అల్లకల్లోలం

తిరువూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం నుంచి ఈదురు గాలులతో కూడి భారీ వడగండ్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి వేసవి వేడితో అల్లాడిన ప్రజలు సాయంత్రం ఒక్కసారిగా చల్లగాలులతో వర్షం పడటంతో కొంత సేదతీరినా, వడగండ్ల వానకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పోల్ విరిగిపోయి రోడ్డుపైకి ఒరిగింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగి నేలపై పడ్డాయి. ప్రధాన రహదారిలో వివిధ షాపులకు చెందిన విద్యుత్ నేమ్ బోర్డులు గాలులకు విరిగి సమీపంలోని ద్విచక్రవాహనాలపై పడటంతో అవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిపేయడంతో పట్టణం పూర్తి అంధకారంలో చిక్కుకుంది. డ్రెయిన్స్ పూడిక తీయకపోవడంతో వరద నీరు రహదారిపై ప్రవహించి పంట కాలువలను తలపించాయి. పలు గ్రామాల్లో చెదువు మదురు జల్లులు పడ్డాయి. ధాన్యం కోసిన రైతులు క టల్లా టల్లో ఉంచిన ధాన్యంపై పట్టా టలు కప్పినా ఎగిరిపోయి తడిచిపోయాయి. వారంలో రెండు సార్లు వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోగా కొద్దో గొప్పో చెట్లకున్న కాయలు పూర్తిగా రాలిపోయాయి.

మొక్కజొన్న రైతుల కుదేల్

ఈదురు గాలులకు మొక్కజొన్న రైతులు పూర్తిగా కుదేలయ్యారు. కొందరు రైతులు మొక్కజొన్న విరిపించి ఒలిపించి కల్లాల్లో పెట్టారు. వాటిపై కప్పిన పట్టాలు ఎగిరిపోవడంతో పంట పూర్తిగా తడిచిపోయింది. కొన్ని చోట్ల నేలవాలిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కంభంపాడు - గోపాలపురం మధ్య రహదారి పక్కనున్న పలుచెట్లు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. మండలం అంధకారంలో ఉండిపోయింది.


తిరువూరులో నేలకొరిగిన లైటింగ్ బోర్డు


అశోక్‌నగర్‌లో నేలకొరిగిన వేప చెట్టు


తిరువూరులో కురుస్తున్న వడగండ్ల వాన


ధాన్యం పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ధాన్యం కొనుగోలుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తాం

- కొనుగోళ్లలో జాప్యంపై కలెక్టర్ లక్ష్మీశ ఆగ్రహం
- నున్న గ్రామంలో పర్యటన

విజయవాడ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ధాన్యం కొనుగోలుకు ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల విషయమై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలవరం కాలువ వద్ద ధాన్యపు రాశులు పేరుకుపోవడాన్ని గమనించి అధికారులపై తీవ్ర ఆగ్రహం చేశారు. పంట కోత కోసి 10 రోజులు దాటుతున్నా అధికారులు ధాన్యం తరలించేందుకు వాహనాలు, సంచులు సమకూర్చడం లేదని, కనీసం ఫోన్‌లు కూడా ఎత్తడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఒక్క నున్న గ్రామంలోనే 700 మెట్రిక్ టన్నుల ధాన్యం రోడ్లపై, కల్లాల్లో ఉండిపోయిందని, దీంతో తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ సివిల్ సప్లై, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వాహనాలు పెట్టి తరలించాలని ఆదేశించారు. రైతులెవరూ ఆందోళన పడవద్దని, ప్రతి ధాన్యపు గింజకూ ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందన్నారు. అలాగే ప్రతి మిల్లు దగ్గర ఓ అధికారిని నియమిస్తామన్నారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీడీపీ నేతలు యార్కారెడ్డి కోటిరెడ్డి, మాదు శివరామప్రసాద్, గంపా శ్రీను, మాజీ ఎంపీపీ యార్కారెడ్డి నాగిరెడ్డి ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న ఐడీఏ అసోసియేషన్ నేతలు, వైద్య ప్రముఖులు

వైద్యుడి కుటుంబానికి ఐడీఏ బాసట

- రూ.15లక్షల చెక్కు అందించిన అసోసియేషన్ నేతలు

చల్లపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యుడైన తోటి వైద్యుడు మృతిచెందటంతో ఆ కుటుంబానికి బాసటగా నిలిచి కుటుంబ సభ్యులకు అసోసియేషన్ నేతలు సాయమందించారు. చల్లపల్లి డాక్టర్ భగత్‌సింగ్ దంత వైద్యశాలలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కృష్ణాబ్రాంచ్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. చీరాలకు చెందిన డాక్టర్ సాల్మన్‌రాజు ఇటీవల మృతిచెందగా, ఏడీఏ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా కుటుంబానికి అసోసియేషన్ అండగా నిలిచింది. వైద్యుడి సతీమణి అమృత హవీలకు రూ.15లక్షల చెక్కును ఐడీఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అజయ్‌బెనర్జీ చేతులమీదుగా అందజేశారు. సీడీఈ చైర్ పర్సన్ డాక్టర్ తనూజ, డాక్టర్ గార్లపాటి నితీష్, కృష్ణాబ్రాంచ్ అధ్యక్షురాలు డాక్టర్ ఉషాకాంతి, కార్యదర్శి డాక్టర్ జి.థియఫిలస్, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ రావి శ్రీనివాసరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఎస్ శ్రీనివాస్, దంత వైద్యులు డాక్టర్ ఎస్.వేణు, డాక్టర్ రవిచౌదరి పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో సత్యమ్మ అమ్మవారు, పూజల్లో ఎమ్మెల్యే దంపతులు

సత్యమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే వసంత దంపతుల పూజలు

నందిగామ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారుపేట గ్రామంలో నిర్వహిస్తున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముందుగా అర్చకులు నందిగం సుబ్బారావు, కోటేశ్వర శాస్త్రి, టీటీడీ వేద పండితుడు దుర్భాకుల రఘునాద శర్మ అవధాని ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషపూజలు, అర్చనలు, హోమాద్రి క్రతువులు, పూర్ణాహుతి పూజలు నిర్వహించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, శిరీష దంపతులు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమాదేవి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు వారికి శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. మహోత్సవాలను విజయవంతానికి సహకరించిన ప్రజలు, అధికారులకు ఈవో హరిగోపీనాథ్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యుడు మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది.

అక్రమంగా ఇసుక, మట్టి తోలితే కఠిన చర్యలు

తిరువూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తోలకాలు చేస్తే, వాహనాల సీజ్‌తో పాటుగా, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని సీఐ గిరిబాబు హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఆగని మట్టి, ఇసుక మాఫియా శీర్షికతో ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నిఘా మరింతగా అప్రమత్తం చేస్తామన్నారు. ఇటీవల అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న అయిదు ఇసుక టిప్పర్లను సీజ్ చేశామన్నారు.

కష్టకాలంలో ఆదుకున్న 'కామధేను'

- విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- 16న చినజీయర్ చేతుల మీదుగా దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ


వీరవల్లి కామధేను యూనిట్‌లో నిర్మించిన దాసాంజనేయ ఆలయం, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చలసాని (ఇన్‌సెట్)

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వీరవల్లిలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో స్థాపించిన కామధేను యూనిట్ బుడమేరు వరద ముంపు సమయంలో ఆదుకుందని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి యూనిట్ లేకపోతే 2024లో అకస్మాత్తుగా సంభవించిన వరద ముంపుతో కృష్ణా మిల్క్ యూనియన్ తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడే పరిస్థితి ఎదురయ్యేదన్నారు. ఈ యూనిట్‌లో నిర్మించిన దాసాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఈ నెల 16న నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం చలసాని సతీసమేతంగా వీరవల్లి తిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయం ఎదుట ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జంక్షన్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి స్వామి ముంగిట ఆహ్వానపత్రిక పెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2023లో ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఆలయానికి భూమి పూజ నిర్వహించామన్నారు. ఆలయం నిర్మాణం శరవేగంగా పూర్తవడంతో 16న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం త్రిదండి చినజీయర్ స్వామి చేతులు మీదుగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించామన్నారు. ఆదివారం నుంచి 15 వరకు ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా 15వేల మందికి అన్నసంతర్పణ చేయనున్నట్టు తెలిపారు. ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లా నలుమూలల నుంచి పాడి రైతు కుటుంబాలు, సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొని జీయర్ స్వామి ఆశీస్సులు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

సుజనా అకాడమీతో ఎస్‌వీహెచ్ విలీనం

- 15న ఉభయ యాజమాన్యాల ఒప్పందం
- యలమంచిలి జనార్ధనరావు - దైతా మధుసూదన శాస్త్రి ఇంజనీరింగ్ కళాశాలగా ఆవిర్భావం
- మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు 45ఏళ్ల చరిత్ర గల ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలను సుజనా అకాడమీ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌తో విలీనం చేస్తున్నట్టు మాజీ ఎంపీ, హిందూ కళాశాలల అనుబంధ సంస్థల అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉభయ యాజమాన్యాలు ఈనెల 15న ఒప్పందం కుదుర్చుకుంటున్నట్టు ఆయన తెలిపారు. 1980లో దివంగత దైతా మధుసూదనశాస్త్రి హిందూ సొసైటీ ఏర్పాటు చేశారని, ఆయన హయాంలోనే ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించారన్నారు. ప్రస్తుతం ఈ కళాశాల కాకినాడ జేఎన్‌టీయూతో అనుబంధంగా ఉందన్నారు. మచిలీపట్నం చుట్టుపక్కల విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయనే ఆశాభావంతోనే ఐఎస్‌వో ధ్రువీకరణ కలిగి ఉన్న ఈ కళాశాలను సుజనా అకాడమీతో విలీనం చేస్తున్నామన్నారు. సుజనా ఫౌండేషన్, విజయదీపం, సుజన్‌మిత్ర, విద్యాన్నపూర్ణ మొదలైన విద్య ఉపాధి ప్రాజెక్టులు నిర్వహిస్తున్న సుజనా అకాడమీతో ఒప్పందం కుదుర్చుకోవడానికి పాలకవర్గ మండలి సభ్యులందరూ సుముఖత వ్యక్తం చేశారన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే, సుజనా గ్రూప్స్ చైర్మన్ వై.ఎస్. చౌదరి, మంత్రి కొల్లు రవీంద్ర, హిందూ కళాశాల అనుబంధ సంస్థల కార్యదర్శి డీజీ శాస్త్రి, పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు.

గ్యాంగ్ సంగమేశ్వరం!

(5వ పేజీ తరువాయి)

ఉపయోగించారు. బయటకు వెళ్లిన పవన్‌కుమార్ తిరిగి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది.

కర్ణాటక సరిహద్దుకు పారిపోయి..

సంగమేశ్వరంలో వలలు లాగే పనుల కోసం తీసుకువెళ్లి చిత్రహింసలు పెట్టడంతో విజయవాడకు చెందిన పవన్ కుమార్ తప్పించుకుని కర్ణాటక సరిహద్దులకు పారిపోయాడు. అక్కడి నుంచి హాస్పేట్‌కు చేరుకుని కొద్దిరోజుల క్రితం విజయవాడలో ఉన్న తన సోదరులకు ఫోన్ చేశాడు. తినడానికి తిండి లేదని, చేతుల్లో డబ్బులు లేవని కన్నీరు పెట్టుకున్నాడు. తనతోపాటు మరో నలుగురు తప్పించుకుని ఇలా వచ్చేశామని వివరించాడు. వారిని ఒక షాపు వద్దకు పంపి, దాని యజమానికి గూగుల్‌పే ద్వారా భోజనాల కోసం కొంత డబ్బులు పంపారు. పవన్‌కుమార్‌తోపాటు తప్పించుకుని వచ్చిన మిగిలిన నలుగురు ఆ డబ్బులతో మద్యం తాగి నిద్రపోయారు. దీనితో చేసేది లేక పవన్‌కుమార్ సమీపాన ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. అతడితో మాట్లాడిన తర్వాత కుటుంబ సభ్యులు నున్న పోలీసులకు విషయం చెప్పారు. పోలీసులు హాస్పేట్ పోలీసులతో మాట్లాడారు. పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు వస్తున్నారని పోలీస్ స్టేషన్లో ఉంచాలని తెలిపారు. తర్వాత పవన్ కుమార్ కుటుంబ సభ్యులు వెళ్లి అతడిని విజయవాడకు తీసుకువచ్చారు. సంగమేశ్వరంలో జరిగిన చిత్రహింసల గురించి అతడు నున్న పోలీసులకు వివరించాడు. ఉత్తర మండలం ఏసీపీ స్రవంతిరాయ్ అతడిని విచారించారు. పవన్ కుమార్‌కు ట్రాప్ జరిగిందంతా రైల్వేస్టేషన్ వద్ద కాబట్టి సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అతడిని అక్కడికి పంపారు.

బంగారు బందరే మన లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలు మార్గాన్ని కలుపుతారు. రాష్ట్రంలోనే మంగినపూడి బీచ్ అత్యంత సురక్షితమైనది. పర్యాటకులను ఆకర్షించేందుకు, బీచ్‌లో సముద్రపు అలల ఉధృతిని తగ్గించేందుకు రక్షణ గోడ నిర్మించనున్నారు. గోసంఘం వద్ద 13 ఎకరాల్లో స్విమ్మింగ్ పూల్, అథ్లెటిక్ ట్రాక్, ఇతర క్రీడల కోసం రూ.50 కోట్ల అంచనాలతో మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికను రూపొందించారు. గిలకలదిండి-కరగ్రహారం గ్రామాల మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా అనుబంధ పరిశ్రమలు, రోల్డ్‌గోల్డ్ నగల తయారీ, పడవల తయారీ, కలంకారీ తదితర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నారు. బందరు కోట, గరాలదిబ్బ, పోలాటి తిప్పలను కలుపుతూ వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. బందరు పోర్టును ఉద్యమాలు చేసి సాధించుకున్నామని, పోర్టు పనులు పూర్తయితే, పోర్టుకు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు అవుతాయన్నారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా యువతకు తగుశిక్షణ ఇప్పించి ఇక్కడే ఉద్యోగులు ఇస్తామని తెలిపారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ, ఏపీఐఐసీ ద్వారా జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించామన్నారు. ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ మాట్లాడుతూ మచిలీపట్నంలో ప్రయోగాత్మకంగా రోబో టెక్నాలజీతో పనిచేసే గోడౌన్‌లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ 216-ఎ జాతీయ రహదారి పోరాటాల ద్వారానే సాధించుకున్నామని, ముందు చూపుగల ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జిల్లా అన్ని రంగాల్లో ముందంజలో నడుస్తుందని తెలిపారు. టీడీపీ, జనసేన నేతలు బండి రామకృష్ణ, మాదివాడ రాము, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబాప్రసాద్, కాగిత వెంకటేశ్వరరావు, గోపు సత్యనారాయణ, పలువురు పురప్రముఖులు పాల్గొన్నారు.


ఇటీవల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టిన ప్రహరీ

కబ్జా కాలనీ

(5వ పేజీ తరువాయి)

కాలనీలోని ప్రతిస్థలం తనదేనంటూ చక్రం తిప్పుతున్నారు. 250 గజాల స్థలాన్ని కొని ఆ ప్రాంతంలో అడుగుపెట్టిన ఈయన ప్రస్తుతం 31సెంట్ల స్థలం తనదేనంటూ నకిలీ డాక్యుమెంట్లు, వీలునామాలు సృష్టించి బేరాలు పెట్టి అమ్మేస్తున్నారు. ఈయన పుణ్యమాని అనేక స్థలాలను చాలామంది కొనేసి ఇళ్లు నిర్మించేసుకున్నారు. ఇంత జరుగుతున్నా ఏ అధికారీ ఆ వైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రోడ్డును సైతం మింగేశారు

ప్రభుత్వ భూమిలో ప్లాట్లు సృష్టించి రోడ్లు వేసిన సదరు పూజారి ఆ పనిని విజయవంతంగా పూర్తిచేసి.. ఇక రోడ్లపై పడ్డారు. ఇటీవల రోడ్డు కోసం తీసిన 300 గజాల స్థలాన్ని కూడా కబ్జా చేసి ప్రహరీ నిర్మించడంతో స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. 1.20 ఎకరం ప్రభుత్వ భూమిలో కొంత భూమి అమ్మకాలు జరపగా, ఇంకా ప్రస్తుతం ఇతని చెరలో సుమారు 13 నుంచి 15 సెంట్ల ప్రభుత్వ భూమి ఉన్నట్టు తెలుస్తోంది. తనతో పాటు తన కుటుంబ సభ్యుల పేర్లతో కూడా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

అదంతా ఇరిగేషన్ భూమే

సన్‌సిటీ కాలనీ వ్యవహారం మాకొక తలనొప్పిగా మారింది. ఈ కాలనీలో ఎక్కువభాగం ఇరిగేషన్ స్థలాలు ఉన్నాయి. ఆ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటాం.

- రాజశేఖర్, ఇరిగేషన్ ఏఈ

172 ఎకరాలు డీనోటిఫై!

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ టన్నెల్స్ అటవీ, కొండ ప్రాంతాల పరిధిలోనే ఏర్పాటు చేయాల్సి వస్తోంది.

అటవీ భూముల్లో చెట్ల లెక్కింపు

అటవీ భూముల డీ నోటిఫికేషన్‌కు సంబంధించి జాతీయ రహదారుల సంస్థ అధికారులు ముందుగానే తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పెట్టుకున్నారు. పలు సర్వేలు కూడా నిర్వహించారు. ప్రతిపాదిత అటవీ భూముల్లో ఎన్నిచెట్లున్నాయన్న వివరాలన అధ్యయనం చేశారు. అటవీ ప్రాంతాన్ని డీజీపీఎస్ రోవర్ల ద్వారా జల్లెడ పట్టించి విస్తీర్ణాన్ని కూడా మదింపు చేశారు. అటవీ భూముల సర్వే కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం 70 మీటర్ల వెడల్పునకు మాత్రమే ఈ సర్వే చేపట్టినా.. 140 మీటర్ల వెడల్పుకు కూడా ఎన్ని చెట్లు ఉంటాయి? ఎంత మీరా విస్తీర్ణం అవసరమవుతుంది? అన్నదానిపై కూడా ముందుగానే సర్వే చేయించి సిద్ధంగా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎంతమేర అటవీ ప్రాంత భూములకు డీ నోటిఫికేషన్ ఇస్తే అంత విస్తీర్ణం మేర రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా భూములు కల్పించాల్సి ఉంటుంది. అటవీ ప్రాంతంలో ఎన్నిచెట్లు ఉన్నాయో అంతకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చూపించే భూముల్లో మొక్కలను నాటాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి పరిధిలో కానీ మరెక్కడైనా కానీ డీనోటిఫై చేసినంత మేరకు భూములను తప్పనిసరిగా కల్పించాల్సిన అవసరం ఉంది.

త్వరలో పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదన

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు కోసం అతి త్వరలో ఎన్‌హెచ్ అధికారులు పర్యావరణ అనుమతులు కోరనున్నారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన ప్రక్రియను కూడా ఎన్‌హెచ్ అధికారులు చేపట్టారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు అనేది గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు కాబట్టి ఖచ్చితంగా పర్యావరణ అనుమతులు తీసుకోవాల్సిందే. అవుటర్ రింగ్ రోడ్డు వల్ల అమరావతి రాజధాని ప్రాంత పరిధిలోని ప్రజలపై ప్రత్యక్షంగా పరోక్షంగా పర్యావరణంపై ఏ విధంగా ప్రభావం చూపిస్తుందన్న దానిపై అధ్యయన రిపోర్టును కేంద్రానికి పంపించాల్సి ఉంటుంది. అమరావతి ఓఆర్ఆర్ అలైన్‌మెంట్‌కు సంబంధించి భౌగోళిక పరిస్థితులను చూస్తే పర్యావరణ విఘాతానికి ఎలాంటి ఆస్కారం లేదు కాబట్టి పర్యావరణ అనుమతుల విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్‌హెచ్ అధికారులు భావిస్తున్నారు. పర్యావరణ అనుమతులకు సంబంధించి ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలతో పాటు రింగ్ రోడ్డు పరిధిలోని మిగిలిన మూడు జిల్లాల్లో కూడా స్థానికంగా ప్రజల నుంచి అభ్యంతరాలను కూడా స్వీకరించడం జరుగుతుంది. ప్రజల అభ్యంతరాలను కూడా తీసుకొని దానికి అనుగుణమైన మార్పులు చేర్పులు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు మంజూరు చేసే అవకాశం ఉంది.

అలైన్‌మెంట్ లొకేషన్ల మార్పు పూర్తి

అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు మొత్తం ఇప్పటి వరకు 13 లొకేషన్లలో మార్పులు, చేర్పులు జరిగాయి. మొదటి దశలో తొమ్మిది లొకేషన్లలో ఈ మార్పులు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎనిమిది లొకేషన్లలోనూ, గుంటూరు జిల్లాలో ఒక లొకేషన్‌లోనూ అలైన్‌మెంట్ మార్పులు జరిగాయి. ఆ తర్వాత కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి, పేరేచర్లలో మరో నాలుగు చోట్ల అలైన్‌మెంట్ మార్పుకు సూచించింది. రెండో దశలో అలైన్‌మెంట్ మార్పులకు సంబంధించి ఉమ్మడి కృష్ణాజిల్లాలో అయితే లేవు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శ్మశానాలు, చెరువులు ఆక్రమణల వంటివి ఉండడంవల్ల అలైన్‌మెంట్‌లో స్వల్ప సవరణలు చేపట్టాల్సి వచ్చింది.

ఇంటిపన్నుల వసూళ్లు రూ.67.71 కోట్లు

- 48 పంచాయతీల్లో క్యూఆర్ డిస్‌ప్లే మిషన్ల ద్వారా వసూలు: డీపీవో అరుణ

మచిలీపట్నం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 25 మండలాల్లోని 497 పంచాయతీల్లో ఇంటిపన్నులు, ఇతరత్రా పన్నులను 80 శాతం వసూలు చేసినట్టు కృష్ణాజిల్లా పంచాయతీ అధికారి జే అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించి జిల్లాలో రూ.84.63 కోట్ల మేర ఇంటిపన్నులు, ఇతరత్రా పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు రూ.67.71 కోట్లను వసూలుచేసినట్టు తెలిపారు. మండలాల వారీగా పన్నుల వసూలు వివరాలిలా ఉన్నాయి. అవనిగడ్డ మండలంలో రూ.1.11 కోట్లు, బంటుమిల్లిలో రూ.1.10కోట్లు, బాపులపాడులో రూ.5.21 కోట్లు, చల్లపల్లిలో రూ.2.51 కోట్లు, గన్నవరంలో రూ.7.20 కోట్లను ఇంటిపన్నులు, ఇతరత్రా పన్నులు వసూలు చేశామన్నారు. ఘంటసాల మండలంలో రూ.1.27 కోట్లు, గుడివాడలో రూ.1.15 కోట్లు, గుడ్లవల్లేరులో రూ.1.93 కోట్లు, గూడూరులో రూ.1.06 కోట్లు, కంకిపాడులో రూ.5కోట్లు, కోడూరులో రూ.80లక్షలు, కృత్తివెన్నులో రూ.కోటి, మచిలీపట్నంలో రూ1.39 కోట్లను వసూలు చేసినట్టు తెలిపారు. మోపిదేవిలో రూ.77లక్షలు, నాగాయలంకలో రూ.1.02 కోట్లు, నందివాడలో రూ.1.14 కోట్లు, పామర్రులో రూ.2.45 కోట్లు, పమిడిముక్కలలో రూ.1.13 కోట్లు, పెడనలో రూ. 63లక్షలు వసూలు చేసినట్టు తెలిపారు. పెదపారుపూడిలో రూ.72 లక్షలు, పెనమలూరులో రూ.3.51 కోట్లు, తోట్లవల్లూరులో రూ.1.05 కోట్లు, ఉంగుటూరులో రూ.2.31 కోట్లు, ఉయ్యూరులో రూ.1.40 కోట్లను ఇంటిపన్నులుగా వసూలు చేసినట్టు ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో పన్నుల చెల్లింపునకు జిల్లాలోని 48 పంచాయతీలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికచేసి క్యూఆర్ డిస్‌ప్లే మిషన్లు ఉపయోగించి ఆన్‌లైన్ పోర్టల్‌లో ఇంటి పన్నులు, ఇతరత్రాపన్నులను వసూలు చేస్తున్నట్టు డీపీవో తెలిపారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడిగుడ్డు ధర (100)	

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

మానసిక ఆరోగ్యానికి ఆధ్యాత్మిక చింతన అవసరం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడితో మానసిక ఉల్లాసాన్ని కోల్పోతున్న నేటితరానికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. వీరవల్లిలో ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజయోగ మెడిటేషన్ శిక్షణా కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. వీరవల్లి టీడీపీ నాయకులు లంక బాబు సురేంద్ర మోహన్ బెనర్జీ, మాజీ సర్పంచ్ నందమూరి మురళీ కృష్ణ ప్రసాద్, నందిగం రవికుమార్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గ్రామ ప్రముఖులు

అసంపూర్తి రోడ్లతో అవస్థలు!

- గండిగుంట పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా నిలిచిపోయిన సర్వీసు రోడ్ల పనులు
- నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు
- నిర్మాణం చేపట్టని కాంట్రాక్టర్లు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

గండిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్ల నిర్మాణం ఏళ్ల తరబడి పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రమాదాలు జరిగి పరిసర గ్రామాల ప్రజలు గాయాలపాలవుతున్నారు. గండిగుంట ఫ్లైఓవర్ నుంచి చినఓగిరాలవైపు వెళ్లే సర్వీసు రోడ్డు అంగడాల పెట్రోల్ బంక్ సమీపం నుంచి ఆనందపురం వరకు కంకర పోసి నిర్మాణం పూర్తి చేయకపోవడంతో చినఓగిరాల, ఆనందపురం, వెంకటాపురం నుంచి ఉయ్యూరు వచ్చి వెళ్లేవారికి అసౌకర్యం కలుగుతుంది. కంకర పోసి తారువేయకుండా వదిలివేయడంతో రాళ్లులేచి ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురై గాయాలపాల వుతున్నారు. జాతీయ రహదారికి మరోవైపు మూర్తిరాజుపాలెం వద్ద నుంచి గండిగుంట సెంటర్‌వరకు మధ్యలో రైస్‌మిల్లు ప్రాంతంలో రోడ్డు నిర్మాణం ఏళ్ల తరబడి చేపట్టక పోవడంతో ఆకునూరు నుంచి ఉయ్యూరు వైపు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి పూర్తయి దశాబ్దకాలం కావస్తున్నా సర్వీసు రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడం పట్ల పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు నడిపేవారి నుంచి ముక్కు పిండి టోల్‌గేట్ వసూలు చేస్తున్న హైవే కాంట్రాక్టర్లు సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తిచేయకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆనందపురం వద్ద అసంపూర్తిగా సర్వీసు రోడ్డు



గండిగుంట రైస్‌మిల్లు సమీపాన..



విద్యార్థిని వర్షను అభినందిస్తున్న జనసేన నేత చలమలశెట్టి రమేశ్‌బాబు

ఇంటర్ విద్యార్థినికి అభినందన

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ బైపీసీలో 934 మార్కులు సాధించిన పెరికీడు గ్రామానికి చెందిన జనసేన నాయకురాలు బండారు లక్ష్మీప్రసన్న కుమార్తె మానస వర్షను జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు అభినందించారు. ఏలూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో బైపీసీ కోర్సులో ఉత్తమ ఫలితాలు సాధించిన మానస వర్షకు చలమలశెట్టి రమేశ్‌బాబు ఆదివారం తన నివాసంలో కేకు కట్ చేసి శుభాభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వడ్డి నాగేశ్వరావు, అహమ్మద్,వడ్డి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నున్నలో రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న హెచ్ఎం భూపాలరెడ్డి, తదితరులు

విజయవాడ రూరల్ : ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ ఎయిడెడ్ కళాశాల విభాగంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రథమ స్థానంలో నిలచిన నున్నకు చెందిన విద్యార్థిని గాజుల రాజ్యలక్ష్మిని ఆదివారం పలువురు సత్కరించారు. రాజ్యలక్ష్మి పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదివి 1000/984 మార్కులు సాధించి ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆదివారం గ్రామ జడ్పీ హైస్కూల్ ప్రిన్సిపాల్ వజ్రాల భూపాలరెడ్డి రాజ్యలక్ష్మిని సత్కరించారు.



బాలమేళాలో జనసేవా సమితి, సేవా భారతి సభ్యులు

నాణ్యమైన విద్యను అందించాలి

ప్రసాదంపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో జనసేవా సమితి, సేవా భారతి సంస్థలు సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బలహీనవర్గాలకు బోధించేందుకు ఎనిమిది దశాబ్దాలుగా చేస్తున్న కృషి అభినందనీయమని సేవా భారతి కోశాధికారి శుభశేఖర్ అన్నారు. శుక్రవారం ఎనికేపాడులోని విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బాల మేళా నిర్వహించారు. సేవా భారతి ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కార్యదర్శి మాధురి మాట్లాడుతూ, విద్యా విషయక అంశాలతో పాటు ఆయా ట్యూషన్ కేంద్రాల్లో సమ్మిళిత పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన విహార ఆంగ్ల మాధ్యమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ జి.రామాంజనేయులు పాల్గొన్నారు.



బీపీ మండల్ చిత్రపటం వద్ద వలంటరీ ఆర్గనైజేషన్ సభ్యుల నివాళి

ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు
బీపీ మండల్ వర్ధంతి

ప్రసాదంపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు, సామాజిక న్యాయం కోసం పరితపించిన యోధుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందెశ్వరి ప్రసాద్ మండల్ 43 వర్ధంతి బీపీ మండల్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రసాదంపాడులో ఘనంగా నిర్వహించారు. సంస్థ కన్వీనర్ లోయ శ్రీరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఓబీసీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి 42 అంశాలను ప్రతిపాదిస్తే కేవలం విద్య ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్లు కల్పించి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సువర్ణరాజు, ఆర్గనైజర్ కో కన్వీనర్ చెమట శ్రీనివాసరావు, సభ్యులు ఆరుద్ర అప్పారావు, బీసీ యువ నాయకులు చిమట సాయి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రసాద్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం నింపే
విద్యను బోధించాలి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసికంగా శారీరకంగా ఆత్మస్థైర్యాన్ని పెంచుకునే విధంగా విద్యాబోధన ఉండాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి వీరవల్లి వాణి విద్యానికేతన్ 36వ వార్షికోత్సవ వేడుక పాఠశాల ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్ అధ్యక్షతన జరిగింది. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

గన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మ్రాని కొమ్మల ఆదివారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నారులు మ్రాని కొమ్మలను చేతబోని క్రీస్తూ గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లోని పురవీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. కేసరపల్లి ఆర్సీఎం విచారణలో రెవరెండ్ ఫాదర్ నూతలపాటి కిషోర్ ప్రసంగిస్తూ యేసుక్రీస్తు జెరుసలేం పట్టణంలోకి వచ్చే సమయంలో ప్రజలు మ్రాను కొమ్మలతో స్వాగతం పలికినట్లు చెప్పారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి తపస్సు కాలం పరిశుద్ధ వారం ప్రారంభంలో మ్రాను కొమ్మల ఆదివారం జరుపుకుంటామని తెలిపారు. రెవరెండ్ ఫాదర్ సందీప్, సంఘ పెద్దలు దీక్షాపరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : తోటి మనుషుల పట్ల ప్రేమ, దయ, త్యాగం చూపించాలన్నదే ఏసు ప్రభువు సందేశమని దానిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని స్థానిక జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి ఫాదర్ చేబ్రోలు జోసెఫ్ తంబి అన్నారు. ఆదివారం మట్టల పండుగ సందర్భంగా పెరికీడు నిత్య సహాయ మాత టవర్ నుంచి ఈత మట్టలు చేబూని జంక్షన్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు.

ఉయ్యూరు : ఉయ్యూరు సుగాలీకాలనీలో బెతేల్ ప్రార్థనా మందిరం పాస్టర్ విజయ్ రాజ్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. సండే స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సండేస్కూల్ టీచర్ కాగిత మీనాక్షి పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. గండిగుంట, ఉయ్యూరు అంబేద్కర్ నగర్‌లో మట్టల ఆదివారం నిర్వహించారు.



పెరికీడు మరియమాత టవర్ వద్ద మట్టలతో ప్రదర్శన

టీటీడీలో గోవుల మృతిపై అసత్య ప్రచారం

- మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు భూమన కుట్ర
- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బ తీసేలా టీటీడీలో గోవులమరణాలపై భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారం మతవిద్వేషాలను రెచ్చగొట్టేదిగా ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ధ్వజమెత్తారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో టీడీపీ కూటమి నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అదో నల్లరాయి...దాని మీదికి చెప్పు విసిరితే ఏమవుతుందంటూ గతంలో వేంకటేశ్వరస్వామిపై విమర్శలు చేసిన కరుణాకరరెడ్డి మరోసారి దుష్ప్రచారానికి తెరలేపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలజడి సృష్టించేందుకు, రాష్ట్ర ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై రోజుకో తప్పుడు ప్రచారానికి ఒడిగడుతున్నాడని విమర్శించారు. టీటీడీ గోశాలలో వంద గోవులు మృతి చెందాయంటూ కరుణాకర రెడ్డి చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని తెలిపారు. గోశాలలోని ఆవులు వృద్ధాప్యం, ఈత సమయంలో, వ్యాధులతో నెలకు సగటున పది వరకు మృతి చెందడం సహజమని, కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్‌లో చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫోటోలు ఇక్కడివి కావని.. అంతా బూటకమని వ్యాఖ్యానించారు. టీటీడీ గోశాలలో 260 మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణ చూస్తారని, టీటీడీ పట్టించుకోవడం లేదనేందుకు ఆధారాలు లేవని తెలిపారు. కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న రోజుల్లో ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టికెట్లు అమ్ముకోవడం, డాలర్లు మాయం వంటి అపవిత్ర పనులు జరిగాయని గుర్తు చేశారు. కరుణాకరరెడ్డి కుమార్తె నీహారెడ్డి వివాహాన్ని క్రైస్తవ మతాచారాలతో చేసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. తిరుమల కొండపై అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించిన పాపం వైసీపీది కాదా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, సంగెపు రంగారావు, అంగిరేకుల మురళి, తుమ్మల రాంకుమార్, అనంతనేని చంద్రశేఖరాజాద్, శొంఠి శివరాంప్రసాద్, ఇబ్రహీం, జనసేన నాయకులు తాతపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెదపులిపాకలో టిప్పర్లను ఆపేసిన గ్రామస్థులు.. టైరు కింద బైక్ (ఇన్‌సెట్లో)

ఇసుక టిప్పర్ల బీభత్సం

- ఓవర్ లోడ్, అపరిమిత వేగంతో జనంపైకి
- ద్విచక్రవాహనదారుడికి తప్పిన ప్రమాదం
- వాహనాలు ఆపి నిరసన తెలిపిన పెదపులిపాక గ్రామస్థులు

పెనమలూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇసుక టిప్పర్లు పెదపులిపాకలో బీభత్సం సృష్టిస్తున్నాయి. గ్రామంలో ఓవర్‌లోడులతో ప్రయాణిస్తూ దుమ్ము ధూళి రేపుతూ తీవ్ర వాయు కాలుష్యానికి కారణమవుతున్న టిప్పర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే టిప్పర్ల వల్ల జరిగిన రెండు ప్రమాదాలలో వాహనదారులు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒక ఘటనలో సైకిల్ నడుపుతున్న గ్రామస్థుడు టిప్పరు కింద పడి స్వల్ప గాయాలతో బయటపడగా...మరో ఘటనలో మోటారు సైకిల్‌పై వెళుతున్న అన్నాచెల్లెలును టిప్పరు ఢీకొనడంతో ప్రమాదంలో వారి మోటారు సైకిల్ టిప్పరు కింద పడి నలిగిపోగా ఇద్దరూ తప్పించుకొని ఊపిరి పీల్చుకొన్నారు. దీంతో కోపోద్రిక్తులయిన గ్రామస్థులు టీడీపీ నాయకులు మునునూరు శ్రీనివాసరావు, శ్రీధర్‌ల నేతృత్వంలో భారీ సంఖ్యలో టిప్పర్లను ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు. టిప్పర్ల బీభత్సాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు రంగంలోకి దిగి టిప్పర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న యార్లగడ్డ సతీశ్

218 మందికి వైద్యపరీక్షలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకొని పేదప్రజలు తమ ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలని టీడీపీ నాయకులు యార్లగడ్డ సతీశ్ అన్నారు. శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం అన్వి సూపర్ స్పెషాలిటీ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని యార్లగడ్డ సతీశ్ ప్రారంభించారు. శిబిరంలో 218 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ తెలిపారు. హాస్పిటల్ వైద్యనిపుణులు వీరమాచనేని స్వరాజ్యం, పోలవరపు కల్యాణ్ చక్రవర్తి తదితరులు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం లో జనసేన నాయకుడు చలమలశెట్టి రమేశ్‌బాబు, ఆర్యవైశ్య సంఘం నాయకులు చామర్తి రాంబాబు, వీరమాచనేని శ్రీదేవి, ఎంపి అలీం, గార్లపాటి రాజేశ్వరరావు, కడగల శ్రీనివాసరావు, కొల్లి బుజ్జి, జాస్తి భూపతి, మేడేపూడి రామ్మోహన్, వీరమా చేని బుజ్జి, అక్కినేని రాఘవేంద్రరావు, తాడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల ఆవరణలో..

ఉయ్యూరు : సమాజంలో ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ సేవలు ప్రశంస నీయ మని వాకర్స్ అసోసియేషన్ జిల్లా గవర్నర్ సనకా సుబ్బారావు కొనియాడారు. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్, మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యాన ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం మెగా వైద్యశిబిరం నిర్వ హించి 200 మందికి గుండె, నేత్ర, బీపీ, షుగర్, మహిళలకు కేన్సర్ వైద్యపరీక్షలు చేశా రు. సభ్యుల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహి స్తామని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కోడె సాంబశివరావు, చంటిబాబు ప్రకటించారు. వైద్య విభాగ ఛైర్‌పర్సన్ సంగం తిరుమలరావు, అసోసియేషన్ జిల్లా నాయకులు నెల్లి రాంబాబు, పొగిరి రాము, వినయ్‌కుమార్, శ్రీనివాసరావు, కిషోర్‌కుమార్, బాలాప్ర సాద్ తదితరులు పాల్గొని సేవలందించారు.



గుండె, ఇతర వైద్యపరీక్షలకు వేచి ఉన్న రోగులు



గన్నవరం టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు

గన్నవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు అన్నారు. ప్రతి 30 కుటుంబాలకు సాధికార సారథు లు ఇన్‌చార్జిలుగా వ్యవహరి స్తారని, పార్టీలో ఉన్న సెక్షన్ ఇన్‌చార్జిలందరిని కుటుం బ సాధికార సారథులుగా పిలవటం జరుగుతుందన్నారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు ఉంగుటూరు నాయకుల కు కుటుంబ సాధికార సారథుల నియమకాలపై ఆ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వద్రాణం హరిబాబు నాయుడు మాట్లాడుతూ ప్రతి 30 కుటుంబాలకు సాధికార సారధి ఇన్‌చార్జిగా ఉంటారని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యనారాయణ ప్రసాద్(సూర్యం), టీడీపీ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, సుంకర విజయలక్ష్మీ, కొండేటి కొండలరావు, గోగినేని విష్ణు వర్ధనరావు, రవి, బెజవాడ నాగేశ్వరరావు, బాబి, జల్లెడ శ్రీమ న్నారాయణ, కుందేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు పారదర్శకంగా ఉండాలి

హనుమాన్‌జంక్షన్ : టీడీపీ గ్రామ కమిటీ నియామకాలు వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ఉండేలా మండల నాయకత్వం బాధ్యత తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు అన్నారు. శనివారం రాత్రి స్థానిక విజయవాడ రోడ్డులో పార్టీ కార్యాలయంలో పార్టీ అధిష్టానం సం స్థాగత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు మేరకు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిరమామిళ్ల సూర్యం, పుట్టా సురేశ్, గుండపనేని ఉమావ రప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, కొమ్మారెడ్డి రాజేశ్, మొవ్వా వెంకటేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మి, మండాది రవీంద్ర, చలసాని శ్రీనివాసరావు, దయాల రాజీవ్‌కాంత్, చిన్నాల లక్ష్మీనారాయణ, మొవ్వా వేణుగోపాల్, చెరుకూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కంకిపాడు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందిన ఘటన దావులూరు టోల్‌గేట్ వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడపకు చెందిన బోయి అచ్చయ్య (46) సొంతంగా టిప్పర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే క్రమంలో కంకర లోడుతో పమిడిముక్కల మండలం మంటాడ వెళ్తున్నాడు. వేకువజామున కాల కృత్యాలు తీర్చుకునేందుకు దావులూరు టోల్‌గేటు వద్ద టిప్పర్ ఆపి, రోడ్డు పక్కన వెళ్తున్నాడు. అదే సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో అచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అం దుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

తప్పిన పెనుప్రమాదం

గుడివాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరురోడ్డులోని ఓ చేపల మేత గోడౌన్‌లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుత్ మీటర్‌లో సాంకేతిక లోపంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు గోడౌన్‌లోకి వ్యాపించకుండా నియంత్రించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో గోడౌన్ సమీపంలోని రెండు ఏసీలు, ఫర్నీచర్ అగ్నికి దగ్ధమయ్యాయి.


మంటలను ఆర్పుతున్న స్థానికులు

పొంచి ఉన్న ప్రమాదం

● ప్రమాదకరంగా మర్రివాడ రైవస్‌కాల్వ వంతెన ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : మర్రివాడ వద్ద రైవస్‌కాల్వ వంతెన ప్రమాదకర పరిస్థితులో ఉండటంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వంతెనపై రెండు మూడు చోట్ల గోతులు ఏర్పడి స్లాబు కాల్వలో కూలిపోయింది. దీనికితోడు వంతెనకు రెండువైపులా జాయింట్ల వద్ద పగుళ్లిచ్చి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాత్రివేళల్లో వాహనదారులు , పాదచారులు రాకపోకల సమయల్లో గోతుల్లో పడి ప్రమాదాలకు గురవక తప్పడం లేదు. వస్తుంది. వంతెన పొడవునా పగుళ్లు ఏర్పడ్డాయి. దీనికితోడు ఓవైపు వంతెన రెయిలింగ్ కూలి కాల్వలో పడేందుకు సిద్ధంగా ఉంది. విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి మర్రివాడ, సాయిపురం, జబర్లపూడి, యలమర్రు, ఈదుల మద్దాలి, పెదపారుపూడి వెళ్లేందుకు ఈ వంతెనపై నుంచే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వంతెనపై భారీ గోతులు ఉన్న చోట గ్రామస్థులు కర్రలు పాతి ఎరుపురంగు రిబ్బన్లు కట్టి, ప్రమాద పరిస్థితి తెలియజేసేలా ఏర్పాటు చేశారు. వంతెన ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా సదరు అధికారులు దృష్టిసారించి వంతెనకు వీలైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


మర్రివాడ వద్ద రైవస్‌కాల్వ వంతెనపై పగుళ్లతో ఏర్పడిన గొయ్యి


కాల్వలో పడేందుకు సిద్ధంగా ఉన్న వంతెన రెయిలింగ్

బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుంది



రైవస్ కాల్వ వంతెనపై గోతులు, పగుళ్ల ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఈవంతెనపై బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తుంది. వంతెనపై గోతులు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రాత్రి వేళల్లో రాకపోకల సమయాల్లో పాదచారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

వై.రాజేంద్రప్రసాద్, మర్రివాడ


అవార్డు అందుకున్న విద్యాలయ ఉపాధ్యాయురాలు మేరుగు వెంకటరమణ

వెంకటరమణకు జాతీయ ప్రతిభా అవార్డు

గుడివాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని ఏసీ కళాశాలలో ఆదివారం సదరన్ ప్రైవేట్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎస్‌పీఎల్‌టీవో) వారి ఆధ్వర్యంలో స్థానిక విద్యాలయ పాఠశాల సీనియర్ తెలుగు ఉపాధ్యాయురాలు మేరుగు వెంకటరమణ మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు చేతుల మీదగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డును అందుకున్నారు. వెంకటరమణను పలువురు సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు వెంకటరమణను పాఠశాల డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

‘బోలెం’కు జాతీయ బంగారు నంది అవార్డు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రంగస్థల కళాకారుడు, విక్రమార్కుడు మూవీ ఫేమ్ బోలెం రామారావుకు ఉగాది, మహనీయుల ప్రత్యేక అవార్డుగా జాతీయ బంగారు నంది అవార్డు - 2025 లభించింది. ఉగాది, అంబేడ్కర్ జయంతి అవార్డు ప్రత్యేక వేడుకల పేరుతో హైదరాబాద్‌కు చెందిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ వారు ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో రామారావును సన్మానించి, బంగారు నందిని అందించారు. అవనిగడ్డలోని ఆర్టీసీ డిపోలో ఆయన ఉద్యోగం చేస్తున్నారు. బోలెం రామారావు సతీమణి బోలెం నాగమణి వైస్ ఎంపీపీగా టీడీపీ తరపున పదవీని నిర్వహించారు. చల్లపల్లిలో 30 ఏళ్లనుంచి ఎన్టీఆర్ కళావేదిక స్థాపించి బోలెం భాస్కరరావు చారిటబుల్ ట్రస్ట్ తరపున పేద వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారు. సినిమాల్లోనూ నటించారు. విజయ, విక్రమార్కుడు, బ్రహ్మం గాడి కథ, బాహుబలి సినిమాల్లో నటించారు. బోలెం రామారావు బాలనాగమ్మ నాటకంలో మాయల పకీరు వేషం వేశారంటే అద్భుతంగా ఉంటుంది. హరిశ్చంద్ర నాటకంలో వీరబాహుడు, విశ్వామిత్రుడు పాత్రలు వేసి వేలాది మంది మెప్పు పొందారు. ఆయనకు ఈ అవార్డు రావటం పట్ల కుటుంబసభ్యులు, కృష్ణా జిల్లా నాటక కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


జాతీయ స్థాయి బంగారు నందిఅవార్డు అందుకుంటున్న బోలెం రామారావు

రాష్ట్రస్థాయి నాటక పోటీలను విజయవంతం చేయండి

● కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి. సత్యనారాయణ

గుడివాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18, 19, 20 తేదీల్లో గుడివాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటక పోటీలను విజయవంతం చేయాలని కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.వి. సత్యనారాయణ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబులు కోరారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి నాటక పోటీల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే నాటక పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సంస్థలు, కళాకారులచే వివిధ నాటికలు ప్రదర్శించనున్నాయన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30గంటలకు నాటకప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. కృష్ణా ఆర్ట్స్ ఎంతో వ్యయప్రయాసలతో నాటకరంగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లోని కళాభిమానులు, కళాపోషకుల ఆర్థిక సాయంతో నాటకపోటీలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ప్రసాద్, కన్వీనర్ నరసింహారావు, సభ్యులు మట్టా రాజా, శొంఠి శ్రీనివాస్, లోయ రాధాకృష్ణ, సుఖమంచి మల్లిక్, నాగసాయి, డి.చంద్రశేఖర్, పి.కృష్ణహితేష్, వై.ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి నాటక పోటీల కరపత్రాలను అవిష్కరిస్తున్న కృష్ణ ఆర్ట్స్ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

ర్యాలీలు, డీజేలకు అనుమతిలేదు : డీఎస్పీ

గుడివాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజున డీజేలు, మైకులు, ర్యాలీలకు అనుమతులు లేవని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ స్పష్టం చేశారు. స్థానిక గౌరీశంకరపురంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జాతీయ నేతలు, మహాత్ముల జయంతి వేడుకల్లో అశ్లీల, సినిమా పాటలతో డీజేలు, మైకులను ఏర్పాటుచేసి వారిని అగౌరవపరిచే విధంగా ప్రవర్తించొద్దన్నారు. గుడివాడ సబ్‌డివిజన్ పరిధిలోని 138 ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు, అన్నదానాలు వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. కుల, మత, ప్రాంతాలకతీతంగా ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ జయంతి వేడుకలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. వేడుకలకు ఇబ్బందులు తలెత్తకుండా డివిజన్ వ్యాప్తంగా 30 పోలీస్ యాక్టు అమల్లేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో గుడివాడ డివిజన్ పరిధిలో 50మంది స్పెషల్ పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌ల నిఘా ఉంటుందని, పోలీస్ బృందాలను అప్రమత్తం చేశామని ఆయన వివరించారు.

ముగిసిన రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలు

గుడివాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఫిట్‌జోన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సీనియర్ పురుషుల 74 కేజీల శరీర బరువు విభాగంలో కె.వి.వి.ఎస్.పి ప్రసాద్, ఎ.బాలకృష్ణ, జె.లవకుమార్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 83 కేజీల విభాగంలో ఎస్.బాలసాయిచరణ్, బి.ప్రసన్నకుమార్, షేక్ ఇబ్రహీంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 105 కేజీల శరీర బరువు విభాగంలో కె.పార్థసారథి, పి.జమీల్‌ఖాన్, డి.పృధ్వీకుమార్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 120 కేజీల శరీర బరువు విభాగంలో డి.నవీన్, ఎస్.సాయికృష్ణవీర్, షేక్ అబ్దుల్ వహాబ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. జూనియర్ 59 కేజీల శరీర బరువు విభాగంలో కె.అవినాష్, వై.భరత్‌కుమార్, కె.అనంతరావులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 74 కేజీల విభాగంలో పి.మహబూబ్, కె.పవన్, టి.మణిచందులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 83 కేజీల శరీర బరువు విభాగంలో ఎస్.మణిశ్వర రామ్, వి.రేవంత్, పి.నితిన్‌కుమార్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 93 కేజీల శరీర బరువు విభాగంలో పి.ఆదినవ షణ్ముఖ సాయికుమార్, డి.రాజు, డి.రామ్‌చరణ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. జూనియర్స్ 105 కేజీల శరీర బరువు విభాగంలో ఎస్.శ్రీనివాస్, డి.వేణుసాగర్, బి.వి. రేవంత్‌రెడ్డిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. 120 కేజీల శరీర బరువు విభాగంలో జి.ఎస్.డి. శ్రీచంద్ర ప్రథమ స్థానం సాధించారు.

సబ్ జూనియర్ విభాగంలో ఎస్. శ్రీనివాస్ స్ట్రాంగ్ బాలుడిగా ఎంపికయ్యాడు. జూనియర్ విభాగంలో ఎస్.బాలసాయి చరణ్, సీనియర్ విభాగంలో కె.వి.వి.ఎస్.పి ప్రసాద్‌లు స్ట్రాంగ్‌మ్యాన్‌లుగా ఎంపికయ్యారు.

అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు మున్సిపల్ మాజీ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు బహుమతులను అందజేశారు. వెటరన్ క్రీడాకారుడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి మహ్మమద్ సైదా తదితరులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదరావు

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని అందిస్తున్న బీవీఆర్ యూత్ సభ్యులు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి చేయూతతో గరికపర్రులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీవీఆర్ యూత్ సభ్యులు ఇద్దరు పేద విద్యార్థులకు చదువు నిమిత్తం రూ. 75,000 ల ఆర్థిక సాయాన్ని అందించారు. గరికపర్రుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి గోళ్ల శివకు రూ. 50,000, కుమ్మమూరుకు చెందిన డిగ్రీ విద్యార్థిని మండపాక కీర్తికి రూ. 25,000 నగదు సాయాన్ని బీవీఆర్ యూత్ అధ్యక్షుడు శ్యామ్, కార్యదర్శి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. నిరుపేద విద్యార్థుల చదువు కోసం వెంకటరెడ్డి ప్రతి ఏడాదీ ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారని శ్యామ్ తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.


శ్రీమేథ పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీఐ ఎం.వెంకట నారాయణ

విద్యతోపాటు కళలపై ఆసక్తి పెంపొందించాలి

కూచిపూడి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు కళల పట్ల ఆసక్తి పెంపొందించే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (రామచంద్రాపురం) ఎం.వెంకట నారాయణ పేర్కొన్నారు. కూచిపూడిలోని వేదిక్ శ్రీమేథ పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యతో పాటు నైతిక విలువలు, నీతి కథలు, కళలు, క్రీడల పట్ల వారికి ఆసక్తి కలిగే విధంగా కృషి చేస్తే మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జెడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, భావ తరంగిణి సంపాదకులు భవిష్య, కూచిపూడి ఎస్సై ఎన్. విశ్వనాథం, పాఠశాల చైర్మన్ ఎం.సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ రాధిక సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ బాపిరాజు, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సందడిగా మట్టల ఆదివారం


కూచిపూడిలో మట్టల ఆదివారం నిర్వహిస్తున్న విశ్వాసులు

గుడివాడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏలూరురోడ్డు, కోతిబొమ్మసెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డుల్లోని మౌంట్ కార్మెల్ చర్చి, పామర్రురోడ్డులోని చిన్నతేరేజమ్మ(ఆర్‌సిఎం), సీఎస్ఐ చర్చిల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ఈత కొమ్మల(మట్టల) ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్‌చర్చి ఆధ్వర్యంలో ఫాదర్ బియాంకీ ఉన్నత పాఠశాల నుంచి వర్లబజారు వరకు, గుడ్‌మెన్‌పేటలోని ఆర్‌సీఎం-2 బాపూజీనగర్ నుంచి దేవాలయం నుంచి చర్చి వరకు చిన్నారులతో కలిసి మట్టల ఊరేగింపు నిర్వహించారు. సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు మట్టల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ-1,2 విచారణకర్తలు ఫాదర్ గుజ్జుల మైఖేల్, ఫాదర్ మందపాటి లూయిస్, ఫాదర్ అందుగుల శ్రీకాంత్‌లు దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూచిపూడి : మట్టల ఆదివారం కూచిపూడి ఆర్సీఎం చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఫాదర్ జాకబ్ ప్రసాద్ ఆధ్వర్యంలో హోలీ స్పిరిట్ పాఠశాల నుంచి చర్చి వరకు ప్రత్యేకంగా అలంకరించిన మట్టలను చేతపట్టుకుని ప్రభువును స్తుతిస్తూ ప్రదర్శన నిర్వహించారు. దావీదు తనయ హోసన్నా, యూదుల రాజా హోసన్నా.. అంటూ నినాదాలు చేశారు. ఫాదర్ ప్రసాద్‌ను నూతన వస్త్రాలపై నడిపించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకి ముందు వచ్చే ఈ ఆదివారాన్ని ప్రతి చర్చి వద్ద ఈత మట్టలకు పూలు అలంకలరించి, చిన్నారులు పాటలు పాడుతూ యాత్ర నిర్వహించారు. పిల్లల వెంట పెద్దలు సైతం క్రీస్తు పాటలు పాడుతూ యాత్రలో పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో పూలుగుచ్చిన ఈత మట్టలతో యాత్రకు బయలుదేరిన చిన్నారులు

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ మహోత్సవాలు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : పెసరమిల్లిలో అయ్యప్పస్వామి దేవాలయ ప్రారంభోత్సవ మహోత్సవాలు ఆదివారం రెండో రోజుకు చేరుకున్నాయి. మండప పూజలు, పుష్ప ఫలాధివాస హోమం, అయ్యప్ప మూలమంత్ర హోమం, సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమం, మన్యుహోమం, కాలభైరవ హోమాలను పావనీ శివకుమార్, వర్రే బలరామ్, వర్రే గంగాధర్(తిలక్) దంపతులచే నిర్వహించారు. సాయంకాల వితరణ, శయ్యాది, దర్పణాధివాసములు నిర్వహించారు. కార్యక్రమంలో మామిడికోళ్ల సర్పంచ్ వర్రే విజయలక్ష్మి, అల్లూరి రామశాస్త్రులు, అల్లూరి బుజ్జిబాబు, కమ్మిలి ఫణి, శివాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు. సోమవారం ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం సందరర్భంగా లక్ష్మీ గణపతి, అయ్యప్ప, శ్రీవల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, దాసాంజనేయస్వామి, కాలభైరవ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠలు ఉదయం 8:30 లకు నిర్వహించనున్నారు. ప్రతిష్ఠా కార్యక్రమం అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామోత్సవం, రాత్రి హరివరాసనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ధ్వజస్తంభానికి అభిషేకం చేస్తున్న బలరామ్, గంగాధర్ కుటుంబసభ్యులు

భూమనవి తప్పుడు ఆరోపణలు : టీడీపీ

గుడివాడ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) : తిరుమల, తిరుపతి దేవస్థానంలోని గోశాలలో 100గోవులు మృతిచెందినట్టు వైసీపీ నాయకుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరుణాకర్‌రెడ్డి టీటీడీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, డి.రాంబాబు పాల్గొన్నారు.

పామర్రు : తప్పుడు ప్రచారాలతో మతవిద్వేషాలు రెచ్చకొట్టాలన్నదే వైసీపీ కుట్రని, అందులోభాగంగానే వైసీపీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమల తిరుపతి గోశాలపై నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారని పామర్రు మండల టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ధ్వజమెత్తారు. కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, వేంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, పెందుర్తి మహేష్, వీరాంజనేయులు, గంటయ్య, చాట్ల రమేష్, యార్లగడ్డ రమేష్, వార్డుసభ్యుడు మంతెన రామంజనేయులు , దాలిపర్తి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	133, 142, 153
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

డీజేలకు అనుమతి లేదు: డీఎస్పీ విద్యశ్రీ

అవనిగడ్డ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఎలాంటి డీజేలకు అనుమతి లేదని డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ తెలిపారు. ఆదివారం అవనిగడ్డలో ఆమె మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నియోజకవర్గంలో ర్యాలీలు, సభలు ఏర్పాటు చేసుకోవాలంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు. ఎవరైనా అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించినా, మైక్‌లు ఏర్పాటు చేసినా, డీజేలు పెట్టి ఇతరులకు ఆటంకం కలిగించినా చర్యలు తీసుకుంటామని సబ్ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో ఈ నిబంధనలు కట్టుదిట్టంగా అమలవుతాయని ఆయన స్పష్టం చేశారు.

అంగరంగవైభవంగా..

లంకమ్మ, మారెమ్మ సంబరాలు

అవనిగడ్డ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దివి ప్రాంత వాసుల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవం అంగరంగవైభవంగా జరుగుతోంది. రెండవ రోజైన ఆదివారమూ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం రాత్రి జాతర మహోత్సవం వైభవంగా జరుగగా, ఆదివారం ఉదయం నుంచి భక్తుల రద్దీ కొనసాగింది. శనివారం మొక్కులు తీర్చుకోవటం పూర్తి కాని వందలాది భక్తులు ఆదివారం డప్పువాయిద్యాలతో ఆలయానికి వచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. సర్కిల్ పోలీసు తరఫున సీఐ యువకుమార్ నేతృత్వంలో పోలీసులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర మహోత్సవాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



చింతలమడ మారెమ్మ



మొక్కులు తీర్చుకున్న భక్తులు

చల్లపల్లి: లక్ష్మీపురం శివారు చింతలమడ గ్రామంలో గ్రామదేవత శ్రీమారెమ్మ తల్లి సంబరాలు చివరిరోజైన ఆదివారం అంగరంగవైభవంగా జరిగాయి. ప్రతి ఇంటి నుంచి గ్రామస్థులు ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. మహిళలు రావి చెట్టు వద్ద దీపారాధనలు చేసి టెంకాయలు కొట్టారు. నైవేద్యాలు, పసుపు కుంకుమలు శిరస్సున ఉంచుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అవనిగడ్డ లంకమ్మ, అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు ఆలయానికి వస్తున్న భక్తులు



పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళలు

భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే సహించం

- గోశాలలో ఆవులు చనిపోవడం అవాస్తవం
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారు: ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

గూడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి గోశాలలో వందలాది ఆవులు చనిపోయాయని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గోశాలలో ఆవులు చనిపోలేదు. తిరుమల తిరుపతి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడితే కూటమి ప్రభుత్వం సహించబోదు.' అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం గూడూరులోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల దేవస్థాన భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడే వారికి భక్తులు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని, అయినా వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని ఆయన అన్నారు. గతంలో వేంకటేశ్వరస్వామి నల్లరాయని, చెప్పులు విసిరితే ఏమవుతుందన్న భూమన కరుణాకరరెడ్డి ఇప్పుడు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, టీడీపీ నాయకులు కట్టా మునీశ్వరరావు, గోపీ నాగబాబు, గొరిపర్తి ఫణి, తోట వేణు, కూటమి నాయకులు పోతన రామోజీ, బాసంశెట్టి విజయ్, రాసంశెట్టి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉరుసు ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

గూడూరు పఠాన్‌పేటలోని హజరత్ నిర్గన్‌షా ఔలియా బాబా ఉరుసు మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీ చైర్మన్ పోతన స్వామి, దర్గా కమిటీ చైర్మన్ ఎండీ యాసిన్, కట్టా మునీశ్వరరావు, గోపీ నాగబాబు, పోతన రామోజీ పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి..

మరొక యువకుడికి తీవ్ర గాయాలు

మోపిదేవి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బైక్ - లారీ ఢీకొట్టుకున్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోపిదేవి శివారు కొక్కిలిగడ్డ వెళ్లే అడ్డరోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన రాయన శివతేజ(18), నాగ జశ్వంత్‌లు మోటారు బైక్‌పై మోపిదేవి వస్తున్నారు. చల్లపల్లి వైపు నుంచి చిత్తూరు డిస్పోజల్ బ్యాటరీ లోడుతో లారీ వెళ్తుండగా, కొక్కిలిగడ్డ నుంచి వెళ్తున్న బైక్ లారీ రెండూ ఢీకొట్టుకున్నాయి. శివతేజ, నాగ జశ్వంత్‌లకు తీవ్ర గా యాలు కాగా, గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్‌లో మచిలీపట్నం తరలించారు. చికిత్స పొందుతూ శివతేజ మృతి చెం దాడు. చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడిన నాగ జశ్వంత్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. మోపిదేవి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాయన శివతేజ (ఫైల్)

కృష్ణానదిలో యువకుడి మృతదేహం

కోడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక బృందాలు కృష్ణానదిలో చేసిన గాలింపులో యువకుడి మృతదేహాన్ని గుర్తించాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఉల్లిపాలెం గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై చాణక్య తెలిపిన వివరాల ప్రకారం..కోడూరు తూర్పు వైపునకు చెందిన గంధం సతీష్(29) శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు తన స్నేహితులకు సందేశం పంపి అదృశ్యమయ్యాడు. దీనిపై మృతుడి తండ్రి బ్రహ్మారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద కేసు నమోదు చేసి కృష్ణానదిలో ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపట్టగా ఉల్లిపాలెం బ్రిడ్జి సమీపంలో యువకుడి మృతదేహం గుర్తించామని ఆయన తెలిపారు.



కళారత్న అవార్డు గ్రహీత గుత్తికొండ సుబ్బారావు అభినందన సభలో ప్రసంగిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు

తెలుగు భాషాభివృద్ధికి

గుత్తికొండ సుబ్బారావు అవిరళ కృషి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధి కోసం గుత్తికొండ సుబ్బారావు అవిరళ కృషి చేస్తున్నారని ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తూ భాషకు సేవ చేస్తున్నారని ఆయన అభినందనీయుడని ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు అన్నారు. సీఎం చంద్రబాబు నుంచి ఇటీవల కళారత్న అవార్డు అందుకున్న సందర్భంగా ఆదివారం మహతి కళావేదికలో భావతరంగిణి సంస్థ ఆధ్వర్యంలో గుత్తికొండ సుబ్బారావును సత్కరించారు. ముఖ్య అతిథిగా పెద్దిరాజు పాల్గొన్నారు. సరస్వతి కళాసమితి అధ్యక్షుడు సి.శేషాచార్యులు(అప్పాజీ), జీవిత బీమా ఉద్యోగుల సంఘ నాయకులు జి.కిషోర్, పేరిశెట్టి యోగేశ్వరరావు, భావతరంగిణి అధ్యక్షుడు భవిష్య, కోమలి భ్రమరాంబిక, సాహితీ విమర్శకుడు ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ విడియాల చక్రవర్తి అధ్యక్షత వహించారు.



రహదారిని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కోడూరు - అవనిగడ్డ రహదారిని

నాణ్యతతో నిర్మించాలి

కోడూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారిని నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు కోరారు. ఆదివారం టీడీపీ నేతలతో కలిసి అవనిగడ్డ-కోడూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. గత ఐదేళ్లలో ఈ రహదారిపై ఎన్నో ప్రమాదాలు జరిగి ఎంతో మంది గాయపడ్డారని, కొందరు మృతి చెందారని, ఈ రహదారి నిర్మాణం కోసం కూటమి నేతల ఆధ్వర్యంలో అనేక నిరసనలు చేశామని ఆయన తెలిపారు. వాటి ఫలితంగా ఎంపీ, ఎమ్మెల్యే ప్రోత్సాహంతో నేడు ఈ రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లికార్జునరావు, కడవకొల్లు నాంచారయ్య, అప్పికట్ల రవీంద్రబాబు పాల్గొన్నారు.

బోలెం రామారావుకు జాతీయ బంగారు నంది అవార్డు

చల్లపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు, విక్రమార్కుడు సినిమా ఫేం బోలెం రామారావుకు ఉగాది, మహనీయుల ప్రత్యేక అవార్డుగా జాతీయ బంగారు నంది అవార్డు - 2025 లభించింది. ఉగాది, అంబేడ్కర్ జయంతి అవార్డు ప్రత్యేక వేడుకల పేరుతో హైదరాబాద్‌కు చెందిన జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రామారావును సన్మానించి బంగారు నందిని అందించారు. ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఆర్ శ్రీనివాసరాజు, తెలంగాణ సాంస్కృతికశాఖ చైర్మన్, గద్దర్ కుమార్తె వెన్నెల, ఫిలిం చాంబర్ అధ్యక్షుడు రామకృష్ణాగౌడ్, నటుడు దొరైస్వామిల, దైవజ్ఞ శర్మల నుంచి రామారావు అవార్డును అందుకున్నారు. పలువురు కళాకారులు, కళాభిమానులు రామారావుకు అభినందనలు తెలిపారు.



బంగారు నందిని అందించి సత్కరిస్తున్న తెలంగాణ ప్రభుత్వ ప్రముఖులు, నిర్వాహకులు

మెరక పనుల పరిశీలన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మోకాలిలోతు గోతులతో నిండి ఉన్న ఇండోర్ స్టేడియం ప్రాంతాన్ని మెరక చేసే పనులు ప్రారంభించారు. ఆదివారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె. ఝాన్సీ, టీడీపీ నాయకుడు పి.వి. ఫణికుమార్, గంజాల రవికుమార్, కొనకళ్ల భానుప్రసాద్ తదితరులు పనులను పరిశీలించారు.



ఇండోర్ స్టేడియం మెరక పనులను పరిశీలిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి

అనుభవజ్ఞులతోనే ఫిజియోథెరపీ చేయించుకోండి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనుభవంతో పాటు సర్టిఫికెట్ ఉన్న ఫిజియోథెరపిస్టులతోనే వైద్యం చేయించుకోవాలని ఫిజియోథెరపిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ సి.ప్రభాకర్ సూచించారు. ఆదివారం సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొందరు నకిలీ ఫిజియోథెరపిస్టులు వైద్యం చేస్తామంటూ ఇళ్లకు వస్తున్నారని, వారి వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని రోగులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వైద్యుల సలహాల మేరకే ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచించారు. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజీవ్, కార్యదర్శి డాక్టర్ ఎం.ఎస్.హస్సేన్ పాల్గొన్నారు.

నేటి నుంచి లింకేజీ రుణాలకు దరఖాస్తులు


మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ రుణాల కోసం సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి షేక్ షాహిద్‌బాబు తెలిపారు. 21 నుంచి 50 ఏళ్లలోపు వారు కుల ధ్రువీకరణ, ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు నమోదు చేయించుకోవాలన్నారు. మే 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. మండల కమిటీ ఎంపిక చేసి, రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన కొణతం వీరనాగేశ్వరరావుకు యాదవ సేవా సంఘం సభ్యులు ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పల్లపాటి వెంకట్రావు(చినబాబు), గొరిపర్తి రాము, బుర్రా శ్రీనివాసరావు, దండుబోయిన నాగేశ్వరరావు, ఆరెపు లక్ష్మణరావు, కొణతం రాంబాబు, వై. సత్యనారాయణ, పేపేటి సత్యనారాయణ, తోట నాంచారయ్య, నీలపాల రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : బచ్చుపేట వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి పార్వేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అశ్వ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఊరేగారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయ పర్యవేక్షించారు.



అశ్వ వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి



జార్జి కార్నేషన్ స్కూల్ 2009-10 పదో తరగతి బ్యాచ్

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): జార్జికార్నేషన్ హైస్కూల్‌లో 2009-10 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను వారంతా నెమరువేసుకున్నారు. ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు రమణ తదితరులను సత్కరించారు.

వైభవంగా సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వేకనూరులోని ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో పెరుమాళ్ల మహేష్ కుమార్-పుష్పలత దంపతులు, పోతులూరి నాగేశ్వరాచారి-రాజ్యలక్ష్మి దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం జరిపించారు. అప్పికట్ల బాలకృష్ణ-దివ్య దంపతుల ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు-ఇందిర దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉచిత వైద్య శిబిరం

మోపిదేవి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పెదప్రోలులో విజయవాడకు చెందిన ఈఎన్టీ హాస్పిటల్, లేజర్ సెంటర్ నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని సర్పంచ్ పొలిమేట్ల ఏసుబాబు ప్రారంభించారు. 150 మందికి ఎండోస్కోపీ, వినికిడి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మండవ రాజేష్, కృత్తివెంటి నాగరాజు, చంద్ర రామకృష్ణ, ఎడ్ల శ్రీనివాసరావు సేవలు అందించారు.

95 మందికి కంటి పరీక్షలు

నాగాయలంక, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వారితో మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో ప్రవాసాంధ్రుడు బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 95 మందికి కంటి పరీక్షలు చేసి, అందులో 83 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేశారు. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, క్యాంప్ ఇంచార్జ్ ప్రసనకుమార్, మత్తి శివ, తలశిల రవిబాబు పర్యవేక్షించారు.

గోశాల నిర్మాణానికి విరాళం

పెడన, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించనున్న గోశాలకు వ్యాపారి వీరమల్లు వెంకటరత్నం రూ.5,550 విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆదివారం ఆయన గోశాల నిర్మాణ కమిటీ సారథి నాదెళ్ల కోటికి అందజేశారు. వెంకటరత్నానికి కోటి కృతజ్ఞతలు తెలిపారు.



మలకాపట్నం ఎల్ఈఎఫ్ చర్చిలో సాంస్కృతిక కార్యక్రమం, నాగాయలంక, ఘంటసాల, లక్ష్మీపురంలో క్రైస్తవుల ర్యాలీలు

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

మచిలీపట్నం టౌన్/నాగాయలంక/ఘంటసాల/చల్లపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మలకాపట్నం ఎల్ఈఎఫ్ చర్చిలో మట్టల ఆదివారాన్ని కార్యక్రమాన్ని సంఘ కాపరి తంటిపూడి ప్రభాకరరావు ఆధ్వర్యంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాగాయలంక ఆర్సీఎం చర్చి విశ్వాసులు మర్రిపాలెం నుంచి నాగాయలంక వరకు మానికొమ్మలకు పూలు గుచ్చి, క్రీస్తు సిలువను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఆర్సీఎం చర్చి విచారణ గురువులు జాన్‌బాబు మానికొమ్మల అంతరార్థాన్ని విశ్వాసులకు తెలిపారు. ఘంటసాల పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మానికొమ్మల ఆదివారాన్ని నిర్వహించారు. బేతేలు ప్రార్థనా మందిరం నుంచి విశ్వాసులు, చిన్నారులు ఈత కొమ్మలు పట్టుకుని ర్యాలీగా బయలుదేరగా, మహిళలు రహదారి పొడవునా చీరలు పరిచి క్రీస్తును స్తుతిస్తూ పాటలు పాడారు. వందలాది మంది విశ్వాసులు ర్యాలీగా నడుస్తూ పర్ణశాల ప్రార్థనా మందిరానికి చేరుకున్నారు. పాస్టర్ కోలా దానియేలు-పరంజ్యోతి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చల్లపల్లితోపాటు లక్ష్మీపురం తదితర గ్రామాల్లో చిన్నారులు, యువత, విశ్వాసులు ఈత మట్టలకు పూలు అలంకరించి వాటిని చేతబట్టుకుని హోసన్నా హోసన్నా అంటూ పాటలు పాడుతూ గ్రామాల్లో ప్రదర్శన చేశారు.